# రుక్మిణీ సందేశం

'స్వాతిశ్రీ'



అకస్మాత్తుగా లోపలకు ప్రవేశించినవారిని చూసి రుక్మిణి తెల్లబోయింది.

"రేపే అమ్మాయిని చూడ్డానికి పెళ్లివారు వస్తున్నారు. అబ్బాయికూడా చూడటానికి బాగానే ఉన్నాడు. మన రుక్మిణికి తగినవాడే దొరికాడు. ఆ హుందా, ఆ తీరు ఆ వినయం చూస్తే నా ఈ ఐదేళ్ల అన్వేషణలోనూ ఇలాంటివరుడు కన్పించలేదు. ఇదంతా మన రుక్మిణి అదృష్టం."

"అంతా దాని అదృష్టమే. కాని ఏం లాభం? పెళ్ళిచూపులకని వచ్చిపోతూండడం ఒక ఆచారమైపోయింది. అసలు ఈ కాలంలో పిల్ల నచ్చినా, కట్నం లేకుండా ఎవరు పెళ్ళిచేసుకుంటారండీ? అయినా దాని అదృష్టం ఎలాఉందో మన కేం తెలుసు! ఇంతకుపూర్వం ఎంతమంది రాలేదు. ఎంతమంది పోలేదు" అంటూ విసుక్కుంది సోమసుందరంగారి భార్య లక్ష్మమ్మ.

"ఈ అబ్బాయి అందరిలా కాదే. చాలా వినయవిధేయతలు. పెద్దలంటే భక్తిగౌరవం ఉన్నవాడులా కనిపిస్తున్నాడు. మనిషి మీదు మిక్కిలి సంస్కారట. అతని దృక్పథంలో కట్నాలఛాయ ఉన్నట్టే కన్పించదు."

"ఔను మీకు అందరూ అలాగే కనిపిస్తారు. తీరా పెళ్ళిచూపులై పిల్లనచ్చేవేళకి అయిదు వేలిస్తారా? పది వేలిస్తారా? అంటూ కూరగాయల్లా బేరాలాడుతారు. కట్నం అవసరంలేదని చెప్పిన కనకమ్మగారి కామేశ్వరరావు పదివేలు యిస్తేగాని పెళ్లిచేసుకోనన్నాట్ట. కట్నాలంటే చీదరించుకునే పుల్లమ్మగారి బుల్లేశ్వరరావు ఐదువేలకు చిల్లిగవ్వ తక్కువైతే మంగళసూత్రం కట్టనని పెళ్ళిపీటలమీంచి లేచిపోయాడు. వరకట్నాలగురించి గంటలతరబడి ఉపన్యాసాలిచ్చే వెంకటసుబ్బారావు మామగారు సైకిలూ వాచీ యివ్వలేదని పిల్లని పుట్టింటిదగ్గరే వదిలేశాట్ట. అన్నీ తెలిసికూడా మీరు యింకా పూర్వకాలపు ఫక్కీలోనే మాట్లాడుతారు"

"పోనీ! నీమాటేకానీ! ఇంతవరకు పెళ్ళిచూపులకు ఎందరు రాలేదు—ఎందరు పోలేదు. వీళ్లనికూడా ఆ జాబితాలో చేరుద్దాం"

"బలేమాటన్నారు. ఇంతకీ పిల్లడు ఏం చదివేడో. ఏం చేస్తున్నాడో చెప్పారు కాదు?" అంటూ ప్రశ్నించింది లక్ష్మమ్మ.

"ఔనౌను అసలు విషయం చెప్పడం మరిచా. నామతి కాలిపోను" అంటూ కోటుజేబులోనుండి కవరుతీసి, ఫోటో చూపిస్తూ అబ్బాయి చాల అందంగానూ, ఆకర్షణీయంగానూ ఉన్నాడు. లక్షణంగా ఫస్టుక్లాసులో బి.యే. ప్యాసయాట్ట. సుమారు ఏభై వేలకుపైగా ఆస్తిపాసులున్నాయి. ఉద్యోగం చెయ్యొద్దని వాళ్లనాన్న చెప్తే వింటేనా? "ఉద్యోగం పురుషలక్షణం" అని, ఉద్యోగం లేకపోతే ఈ కాలంలో గౌరవం లేదని పోలీసు డిపార్టుమెంటులో సబ్‌యిన్‌స్పెక్టరుగా చేరేట. పైగా తల్లి తండ్రులకు ఒక్కగానొక్క బిడ్డ!" అంటూ ఏకరువుపెట్టారు. అంతా వింటున్న లక్ష్మమ్మగారు భర్త చేతిలోని ఫోటో యిటూ, అటూ తిప్పిచూస్తూ "అబ్బాయి నిజంగా నవమన్మధునిలా ఉన్నాడండీ! మన అమ్మాయికీ అబ్బాయికీ, ఈడూ, జోడూ సరిగ్గా సరిపోయింది. ఇద్దర్నీ ఒకచోట నిలబెడితే చిలుకా, గోరంకల్లా ఉంటారు. కాని దిక్కుమాలిన వరకట్నం యిచ్చుకోడానికి మనకు తాహతు లేకపోయింది" అంటూ గట్టిగా నిట్టూర్చింది.

"ఎందుకలా విచారిస్తావు? కక్కువచ్చినా కళ్యాణయోగం ఉన్నా ఆగదంటారు పెద్దలు! ఊరికే అధైర్యపడి చేసేదేముంది? అంతా భగవదిచ్ఛ!" అంటూ కుర్చీలో సోమసుందరంగారు వాలిపోయారు. మరి అక్కడే ఉన్నా లాభంలేదని గట్టిగా ఒక నిట్టూర్పు విడచి వంటింట్లోకి వెళ్ళిపోయింది లక్ష్మమ్మ.

* * *

"ఏమిటోయ్ ఈ హడావిడీ అంతా. కబురుపంపించకుండానే ఇలా కొట్టుకొచ్చావ్. ఈ మధ్య పోలీసు డిపార్టుమెంటులో చేరినదగ్గరనుంచి మనిషివి బొత్తిగా మారిపోయావ్" అంటూ పలకరించాడు సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ కుమార్.

"బ్రదర్! కబురు పంపించడానికి కూడా వ్యవధి లేదు. అందుకే స్వయంగా నీ దగ్గరకొచ్చాను"

"ఎప్పుడూ నువ్వూ, నీ కేసులున్నూ. వెధవకేసులు! ఈ కేసులో వేగలేక చస్తున్నానంటే నమ్మరా బ్రదర్!" అంటూ పనామా సిగరెట్టు అందించాడు. ఇన్‌స్పెక్టరు కృష్ణారావు సిగరెట్టు ముట్టించి పొగ గాల్లోకి వదులున్నాడు.

సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ కుమార్ సిగరెట్టు కాలుస్తూ "బ్రదర్! ఇంకా పెళ్ళిసంబంధాలు రావటంలేదా? అయినా కృష్ణా! నీది గట్టి బుర్రరా! ఏ సర్కిల్లో, ఏ సూపరింటెండెంట్లో ప్రమోషనువస్తే అప్పుడు పెళ్ళి చేసుకుంటావ్. ఔను కానీ మొన్న పెళ్లిచూపులకని వెళ్ళేవుట ఏమయింది?" అంటూ ప్రశ్నించాడు.

"అందుకే బ్రదర్! నీ దగ్గర కొచ్చింది.

# రుక్మిణీ సందేశం

పిల్లలక్షణంగా, బాజాగా ఉంది. థర్డు ఫారంవరకు స్కూల్లో చదివి ప్రయివేటుగా మెట్రిక్ కట్టి పాసయింది. సంగీతంలో కూడా కొంచెం ప్రవేశముందని మొదట్లో చెప్పారు. మచ్చుకని ఒక పాటపాడమన్నారు నాన్నగారు. అవో, ఏం పాటనుకున్నావ్.

అద్భుతంగా పాడేసింది. ఆ పాటకి ఎండి మోళ్ళు చిగిరిస్తాయిరా" అంటూ ఏదేదో చెప్పుకుపోతున్నాడు. "ఆగరా బాబూ ఆగు! అసలు విషయం చెప్పకుండా"......అన్న కుమార్ మాటలతో కృష్ణారావు ఈలోకంలో పడ్డాడు.

"అదేరా. ఆ కట్నం ఉంది చూశావ్. అక్కడే వచ్చింది పేచీ! నాన్నగారు పదివేలకు తక్కువైతే వీల్లేదన్నారు. నాకు మాత్రం..."

"ఆపిలనిచేసుకోవాలని ఉంది. అంతేనా?" అన్నాడు సి. ఐ. డి. ఇన్‌స్పెక్టర్ కుమార్ వాక్యం పూర్తిచేస్తూ.

"అవును బ్రదర్. కరెక్టుగా చెప్పావు" అన్నాడు కృష్ణారావు.

"ఛీ. చెప్పకోడానికి సిగ్గు లేకపోతే సరి. స్కూల్లో ఉపన్యాసాలు దంచెయ్యడం గాదురా బ్రదర్! ఇంత సబ్ ఇన్‌స్పెక్టరు పనిచేస్తూ మీనాన్నకు ఆమాత్రం చెప్పలేక పోయావే. ఆపిల్లని తప్ప ఇంకోపిల్లని పెళ్ళి చేసుకోనని చెప్తే మీ నాన్న మాత్రం ఏంచేస్తాడు?" అంటూ వేళాకోళం చేశాడు.

"అందుకేరా, హుటాహుటీని నీ దగ్గరకొచ్చింది" అంటూ ఒక ఉత్తరం అందించారు. సి. ఐ. డి. ఇన్‌స్పెక్టరు కుమార్ ఉత్తరాన్ని ఇలా చదివాడు.

హరిపురం
తేదీ 15-12-59

శ్రీ కృష్ణారావు గారి పాదసన్నిధికి రుక్మిణి వ్రాయు లేఖాంశములు:—

తొలి చూపులోనే మీకు నా హృదయం అర్పించాను. హృదయంతోపాటు మనసు ఏనాడో మీకు అంకితమైపోయింది.

కట్నాల విషయంలో నాన్నగారు తమ అసమ్మతిని తెలియజేశారని, తత్ఫలితంగా మన వివాహప్రసక్తి ముగిసిందని విన్నాను. నేనొక దురదృష్టవంతురాల్ని. కలకాలం కన్యగా జీవించేకన్న మరణిస్తే మేలు! ఈ ఉత్తరం అందిన తక్షణం మీ ఉద్దేశ్యాన్ని తెలియచెయ్యండి. గడువు లోపల ఏ విషయమూ తెలియని ఎడల ఈ నిర్భాగ్యురాలు సోమవారం రాత్రి 9 గంటలకు అంతిమ యాత్ర చేస్తుంది. మన మిరువురం వివాహం చేసుకోనే అదృష్టం ఉంటే వచ్చే జన్మలో మళ్ళీ కలుసుకుందాం.


ఇట్లు
మీ
రుక్మిణి.

ఉత్తరం చదివిన కుమార్ ఒక్కసారి నిర్విణ్ణుడైపోయాడు. "కృష్ణా! ఈ వేళ సోమవారం అనుకుంటా. అప్పుడే టైము ఎనిమిది కావచ్చింది. ఆలస్యంచేస్తే మరి లాభం లేదు. వేగం పద" అంటూ మోటర్ సైకిలు స్టార్టు చేశాడు. కృష్ణారావు అదోలా ముఖంపెట్టి "నాకు చిన్న సందేహంగా ఉంది," అనా, డు కుమార ముఖంలోకి చూస్తూ.





మనోహరమైన
మల్లెపూవుల సువాసన
ఆనందించుటకు
పాల్-తోరా పర్‌ఫ్యూమ్
&
పాల్-తోరా హెయిరాయిల్
వాడండి.
అన్నిచోట్ల మీకు లభించును.
ది మోహిని ఏజెన్సీస్ పర్‌ఫ్యూమర్స్
జకారియ బిల్డింగ్, మజ్ జిద్ బందర్ రోడ్, బొంబాయి. 8.
ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో వ్రాయగోరుదురు.

చీకటిలో మీ సహవాసి
ఎస్ట్రెలా
బ్యాటరీలు



మీ బేటరీ లైటు
నమ్మకముగా వెలుగుటకు ఎల్లప్పుడూ
ఎస్ట్రెలా బేటరీ నుపయోగించండి
అది చాలాకాలము వరకు ఎక్కువ
ప్రకాశవంతమైన వెలుగునిచ్చును.




ఎస్ట్రెలా బేటరీస్ లిమిటెడ్
బొంబాయి - మద్రాసు - ఢిల్లీ - కలకత్తా - కాన్పూరు

"సందేహం లేమిటోయ్? ఊ. వేగం కానీ" అన్నాడు. కృష్ణారావు చేసేది లేక వెనుక సీట్లో కూర్చొని "పోనియ్" అన్నాడు. మోటర్ సైకిలు శరవేగంతో చెట్లనీ, చేమల్నీ దాటుకుంటూ మెలికలు తిరిగిన రోడ్డు గుండా హరిపురం చేరుకొంది. కుమార్ ఒక యింటిముందు స్టాండ్ వేసి "ఏమిటోయ్ నీ సందేహం?" అన్నాడు. కృష్ణారావు అతని దగ్గరిగా వెళ్లి ఏదో చెవిలో చెప్పాడు. అంతా విని "ఆమాట నిజమే. అందులోనూ చదువుకున్న పిల్ల అని మొదట్లో నీవే చెప్పావు. కొంపతీసి మనల్ని బోల్తా కొట్టించడానికి అలా ఉత్తరం రాసి ఈ వ్యూహం పన్నిందేమో. అయినా జాగ్రత్తగా కనిపెడుతూ వుండు. ఆఖరికయినా అసలు విషయం తెలియకపోదు" అంటూ ఏదో సంజ్ఞ చేశాడు. కృష్ణారావు మారు మాటాడకుండా కుమార్‌ని అనుసరించాడు.

ఇద్దరూ పెరటిగోడదాటి వరండా గుండా రుక్మిణి గది చేరుకున్నారు. గది ముందు ఏ అలికిడీ లేనట్లు నిశ్శబ్దం తాండవము చేస్తోంది. గదిలో ఏదో లైటు వెలుగుతున్నట్లు ఊహించాడు కుమార్. ఒకసారి వాచీకేసి చూశాడు. టైము 8 45 అయింది. గట్టిగా శ్వాస విడిచి తలుపు రంధ్రంగుండా తన దృష్టిని సారించాడు.

టేబిల్ ముందు రుక్మిణి కూర్చుంది. టేబిల్ మీద తలవాల్చి ఏదో దీర్ఘంగా ఆలోచిస్తోంది. టేబిల్ మీద ఒక గ్లాసులో పాలు, గ్లాసుకు పక్కగా ఏదో పొట్లం కుమార్‌కి అస్పష్టంగా కనిపించాయి. రుక్మిణి రాసిన కాగితాన్ని ఒకసారి తనలో తాను చదువుకొంది. కడసారిగా తల్లితండ్రుల్ని జ్ఞాపకం తెచ్చుకొని ఎదురుగా ఉన్న ఫోటోతీసి కళ్ళకద్దుకొని "అమ్మా! కలకాలం కన్యగా ఉండి ఈ ప్రపంచంలో బ్రతకలేను. మళ్ళీ అదృష్టం ఉంటే నీ కడుపున పుడతాను. ఈ జన్మలో నీ ఋణం తీర్చుకోలేకపోయాను" అంటూ కన్నీరు కార్చింది.

ఇదంతా ఒక ప్రక్కనుంచి చూస్తున్న కృష్ణారావు మరి ఊరుకోలేకపోయాడు. క్షణం ఆలస్యమయితే కొంప మునిగే విషమ పరిస్థితి ఏర్పడుతుందని ముందుగా ఊహించి గట్టిగా తలుపుల్ని ఒక్క తాపు తన్నేడు. తలుపులు ఊడిపోయి క్రింద పడిపోయేయి. అత్రుతగా లోపలకు ప్రవేశించి ఒక్క ఉదుటున గ్లాసుని, పక్కనే ఉన్న పొట్లాన్ని అందుకున్నాడు. అకస్మాత్తుగా లోపలకు ప్రవేశించిన ఇన్‌స్పెక్టరు కృష్ణారావుని, కుమార్‌ని చూసి రుక్మిణి తెల్లబోయింది

వచ్చేసంచికలో
ప్రత్యేకాకర్షణ
## వ్యాసరచన పోటీ
వివరాలకు వచ్చేసంచిక చూడండి.

ఈ అలజడికి రుక్మిణిగదిలో ప్రవేశించిన సోమసుందరంగారు పోలీసు డ్రస్‌లో ఉన్న కృష్ణారావుని, ఇన్‌స్పెక్టర్ కుమార్‌ని చూసి వెనక్కి తగ్గాడు. "ఈ నేరానికి శిక్షేమిటో తెలుసా?" అంటూ రుక్మిణివేపు చూస్తూ కృష్ణారావు గద్దించాడు.

సోమసుందరంగారి ఒళ్ళు చల్లబడిపోయింది. అర్ధరాత్రి సమయంలో పోలీసు ఇనస్పెక్టర్ కృష్ణారావు, కుమార్ రావలసిన అగత్యం అతనికి బోధపడలేదు. "బాబూ! ఒక్కగానొక్క బిడ్డ. ఏదో తెలియక నేరం చేసి ఉంటుంది. ఆ నేరానికి శిక్ష నాకు విధించండి. యావజ్జీవకారాగారమైనా ఆనందంతో అనుభవిస్తాను" అంటూ ముందుకు వచ్చాడు. రుక్మిణి మాట్లాడకుండా అలా చూస్తూ నిలుచుంది.

"అలా వీల్లేదు. శిక్ష అనుభవించవల్సింది రుక్మిణి. మీరు మాత్రం కాదు. వెంటనే పోలీస్ స్టేషనుకి నడవండి" అంటూ హుంకరించాడు కృష్ణారావు.

"అయ్యో రుక్కూ! ఎంతపని చేశావే! నీకిలాంటి దుర్బుద్ధి ఎలా పుట్టిందే" అని గుండె బాదుకుంటూ ఆరున్నరస్థాయిలో రాగాన్ని అందుకున్నారు లక్ష్మమ్మగారు. ఆమెని ఓదారుస్తూ సోమసుందరంగారు "బాబూ! చేసిన నేరమేమిటో చెప్పండి" అంటూ ప్రాధేయపూర్వకంగా వాళ్ళని బ్రతిమాలుతున్నారు. ఇంక నాటకం సాగితే రక్తి కట్టదని అంతటితో నాటకానికి ఫుల్‌స్టాప్ పెట్టి "ఈ నేరానికి శిక్షేమిటో తెలుసా?" అన్నాడు కుమార్ సోమసుందరంగారి వేపు చూస్తూ.

సోమసుందరంగారు గజగజ లాడిపోయారు. కనురెప్ప వాల్చకుండా తదేక ధ్యానంతో కుమార్ వేపు చూస్తున్నారు. "ఇది శిక్ష" అంటూ రుక్మిణి చెయ్యి కృష్ణారావు చేతిలో పెట్టాడు. అదేమిటో అర్థంగాక సోమసుందరం దంపతులు తెల్లబోయి చూస్తున్నారు.

"వేగం ముహూర్తం నిశ్చయించి పెళ్ళి చెయ్యండి. క్షణం ఆలస్యమయితే మరి రుక్మిణి మీది కాదు," అంటూ కోటుజేబులో కవరుతీసి "ఇది మీ రుక్మిణి పంపిన సందేశం! ఆనాడు రుక్మిణీదేవి శ్రీకృష్ణ పరమాత్మకు వృద్ధబ్రాహ్మణుడి ద్వారా తన సందేశాన్ని పంపించింది. ఈనాడు మీ రుక్మిణీదేవి ఈ కవరుద్వారా తన సందేశాన్ని ఈ కృష్ణుడికి పంపించింది" అంటూ కథంతా చెప్పేడు.

"మా భలే సందేశం పంపించింది. మా రుక్మిణిమాత్రం ఆ రుక్మిణికి తీసిపోతుందా?" అంటూ సోమసుందరం దంపతులు రుక్మిణీ కృష్ణుల్ని ఆశీర్వదించారు. ★

